వరద బాధితులకు అండగా..



ఎస్ఎస్ తాడ్వాయి: బియ్యం అందజేస్తున్న నాయకులు



బియ్యం పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీధర్



ములుగు రూరల్: చేయూతనందిస్తున్న భూక్య సుమలత

ఎస్ఎస్ తాడ్వాయి: ముంపు గ్రామాల్లోని వరద బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని పూర్తిగా వరద ముంపునకు గురైన ఊరట్టం గ్రామంలోని వరద బాధితుల కుటుంబాలకు నర్సంపేట సిటిజన్ ఫోరం సంస్థ సహకారంతో సీతక్క చేతుల మీదుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం కొత్తూర్, కన్నెపెల్లి గ్రామాలలో చేతన ఫౌండేషన్ దాతల సహకారంతో వరద బాధిత కుటుంబాలకు సీతక్క నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నష్టం జరిగిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ముందుకు వచ్చి వరద బాధితులకు సాయం అందించిన దాతలు, సంస్థలను సీతక్క అభినందించారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, తాడ్వాయి మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, గౌరవ అధ్యక్షుడు అనంతారెడ్డి, సర్పంచ్ ఇర్ప సునిల్, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు రవీందర్, నాయకులు సిద్దిరెడ్డి, రాజేందర్, రాజిరెడ్డి, నర్సింహులు, రాంబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మేడారంలో..

మేడారంలో వరద బాధిత చిరువ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని పూసల చైతన్య వేదిక గౌరవ అధ్యక్షుడు పన్నీరు నరేంద్ర అన్నారు. ఆదివారం మేడారంలో వరద ముంపునకు గురైన పూసల కుల చిరువ్యాపారులకు పూసల చైతన్య కమిటీ రాష్ట్ర కమిటీ కులస్తుల సహకారంతో 25 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.2 వేలు, 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న చిరువ్యాపారులను జంపన్నవాగు వరద తీరని ఆర్థిక నష్టం కలిగించదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక సలహాదారు తన్నీరు రమేష్, కళావతి, వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటిపల్లి నరేందర్, అధ్యక్షులు పన్నీరు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి అమరేందర్, ఉపాధ్యక్షులు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు సదానందం, ఉపాధ్యక్షురాలు సంధ్య, భూపాలపల్లి జిల్లా కన్వీనర్ ముద్రకోల రవి, నాయకులు బిక్షపతి, కృష్ణ, సతీష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని ఊరట్టం గ్రామంలోని వరద బాధితులకు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. జంపన్నవాగు వరదకు గ్రామం పూర్తిగా మునిగిపోవడంతో గ్రామస్తులు సర్వం కోల్పోయారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలోని 83 మంది కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 13 కిలోల బియ్యాన్ని సర్పంచ్ గడ్డం శ్రీధర్ పంపిణీ చేశారు. కిరాణా కిట్‌లను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ సునీల్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ములుగు: భారీ వర్షాల కారణంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మారిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఎమ్మెల్యే సీతక్క ఇచ్చిన పిలుపులో భాగంగా ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్ రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సీతక్కకు రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా లక్ష అందించిన రవిచందర్‌ను సీతక్క అభినందించారు. భారీవర్షాల కారణంగా నష్టం వాటిల్లిన కుటుంబాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్, భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, నల్లెల్ల భరత్, రేవంత్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి: వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న సీతక్క



ములుగు: సాయం అందజేస్తున్న రవిచందర్

ములుగు రూరల్: భారీ వర్షాల కారణంగా ఇళ్లు నీటమునిగి ఇబ్బందులు పడుతున్న పస్రా ఎస్సీ కాలనీవాసులకు గ్రామానికి చెందిన భూక్య సుమలత-సక్కునాయక్‌లు చేయూతనందించారు.ఆదివారం గ్రామంలో ఎస్సీ కాలనీలో సుమారు 20 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందించారు. వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

చేయూత

ములుగు: ఎడతెరిపి లేని వర్షాలకు వచ్చిన వరదల మూలంగా నిరాశ్రయులైన కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనందించింది. ఈ మేరకు ములుగు జిల్లాని గోవిందరావుపేట మండలం పస్రా, ప్రాజెక్టునగర్, తాడ్వాయి మండలంలోని ఊరట్టం, ఏటూరునాగారం మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాలు వరద ముంపునకు గురికావడంతో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసరాల కిట్లను అందించగా రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి , జిల్లా జెడ్పీచెర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు , అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం..



నారుమళ్లను పరిశీలిస్తున్న నాయకులు

మంగపేట: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు గౌరారంవాగు ఉప్పొంగి ప్రవహించడంతో మిర్చి నారుమళ్లు కొట్టుక పోవడంవతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రైతు బంధు జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య అన్నారు. గౌరారంవాగు వరదలకు ఒడ్డు కోతకు గురైన మిర్చి నారుమళ్లను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణతో కలిసి ఆ పార్టీ నాయకుల బృందం ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే కరెంటు పునరుద్ధరణ చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. అదే విధంగా వరద కారణంగా నారుమళ్లు కోతకు గురైన బాధితులతో పాటు వరద తీవ్రతకు నీట మునిగి కొట్టుకుపోయిన బాధిత రైతులను ఆదుకునేందుకు మంత్రి సత్యవతి రాథోడ్, కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి సంబంధిత హార్టీకల్చర్ అధికారులతో సర్వే చేయించి బాధిత రైతులకు నష్ట పరిహారం ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సభ్యులు పచ్చా శేషగిరిరావు, లలితమ్మ, మండల రైతు కోర్డినేటర్ మోహన్‌రెడ్డి, మంగపేట ఎఫ్ఎస్‌సిఎస్ డైరెక్టర్ నర్రా శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ వైకుంఠం, బీఆర్ఎస్ మండల నాయకులు రాజుయాదవ్, మూగల రమేష్, విష్ణు పాల్గొన్నారు.

కల్యాణ కట్ట షెడ్డు ధ్వంసం



ధ్వంసమైన కల్యాణ కట్ట షెడ్డు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జంపన్నవాగు వరదకు వాగు రోడ్డు పక్కన నిర్మించిన కల్యాణకట్ట షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తుల తలనీలాలు సమర్పించేందుకు రూ. 20 లక్షలతో షెడ్డును నిర్మించారు. వాగు వరదకు షెడ్డు ధ్వంసమై నేలకూలింది. అంతేకాకుండా జంపన్న వాగు రోడ్డు పక్కన ఉన్న కల్యాణకట్ట షెడ్లన్నీ కూడా వరదకు దెబ్బతిన్నాయి.

క్లుప్తంగా

పనులు చేపట్టిన కార్మికులు



ఎస్ఎస్ తాడ్వాయి : గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె వదిలి వరద ముంపు గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల బాట పట్టారు. గత ఐదు రోజుల క్రితం కురిసిన వర్షాలకు జంపన్నవాగు వరదకు మేడారం జలమయం కావడంతో చెత్త, చెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. దీంతో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టే పనులతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశ్యంతో కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు మేడారం పరిసర ప్రాంతాల్లో సేవలను పూనుకున్నారు. వరద ముంపునకు గురైన గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులకు గురికావద్దనే ఉద్దేశ్యంతో సమ్మెను వదిలి సేవలందించేందుకు ముందుకు వచ్చామని కార్మికులు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు



ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల, కొండాయి గ్రామాల్లో ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను స్థానిక పంచాయతీ కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా చేపట్టారు. బ్లీచింగ్ , తాగునీటి క్లోరినేషన్ పనులు చేపట్టారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

హామీలు అమలు చేయాలి



మంగపేట: తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ప్రత్యక్షంగా కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీడబ్ల్యూజేయూ (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుమేరకు తలపెట్టిన పోస్టు కార్డు ఉద్యమం మండలంలోని కమలాపురంలో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడినా నేటి వరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఏఒక్క హామీ అమలుకాలేదన్నారు. ఐజేయూ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమానికి టీజేఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎర్రం స్వామి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జిల్లా సహాయకార్యదర్శి నిమ్మగడ్డ శ్రీనివాస్, చిన్న పత్రికల జిల్లా అధ్యుడు ఈసంపల్లి సురేందర్, ఈసీ మెంబర్ పవన్‌కుమార్, నాయకులు కల్లె బోయిన శ్రీనివాస్, వడ్ల కొండ శ్రీనివాస్, వీరయ్య, అక్కపెల్లి రాజేష్, నరేష్, వేమ సురేష్, పల్లపు రమేష్, జానపట్ల జయరాజ్, కుర్మిళ్ళ శ్యామ్, సాంబశివరావు, రఫీ, నరేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఏటూరునాగారం: కొండయి గ్రామంలో ఇటీవల వచ్చిన వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ. 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద ప్రళయం నుంచి తేరుకొని ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న కొండాయి, మల్యాల గ్రామాలను సూడి కృష్ణారెడ్డితో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు దావూద్, దుగ్గి చిరంజీవిలతో కూడిన బృందం ఆదివారం గ్రామాన్ని పరిశీలించింది. వరద ప్రవాహాన్ని సంఘటన తీరును కమిటీ గ్రామస్తులు, రైతులతో చర్చించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జంపన్న వాగు వరద ఉధృతికి, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా నాసిరకంగా నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోయి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆకస్మాత్తుగా వచ్చిన వరదల్లో ప్రజలు ఏం చేయాలో తెలియక కట్టుబట్టలతో పరిగెడుతూ ప్రాణాలు కాపాడుకోవడానికి అనేక ప్రయత్నాలు చేశారన్నారు. దురదృష్టవశాత్తు ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమని ప్రభుత్వం ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాయం రామ్మూర్తి, పాయం రాఘవయ్య, జబ్బార్, మాచర్ల తిరుపతి ,కాక వెంకన్న, పరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటాపురం(కె): వెంకటాపురం(కె) ఎస్సైగా రేక అశోక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వాజేడు మండల పరిధిలోని పేరూరు ఎస్సైగా పని చేస్తున్న ఆయన వెంకటాపురం(కె)కు బదిలీ అయ్యారు. ఎస్సైగా బాధ్యతలను అశోక్‌కు పలువురు శుభాకాంక్షలను తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో వైద్య సేవలు



గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న వైద్యులు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల, మల్యాల, కొండాయి గ్రామాల్లోని ముంపు ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి మండలంలోని రొయ్యూర్, కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది ఆదివారం ఏటూరునాగారం నుంచి జంపన్నవాగు దాటి బోటులో లోతట్టు గ్రామాలకు తరలివెళ్లారు. వరదల్లో చిక్కుకొని గాయపడిన పలువురికి వైద్య చికిత్స అందించారు. గర్భిణులు, చిన్నారులు, మహిళలు, వృద్ధులకు వైద్యులు సుమలత అభినవ్, మౌనిక, గిరి, అన్మిషా, ప్రణీత, సుచరిత పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా కల్పించారు. ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని కౌన్సెలింగ్ చేశారు. గ్రామంలో కలియతిరిగి బ్లీచింగ్, క్లోరినేషన్ చేయించారు. 2022లో రిక్రూట్ అయిన పల్లెదవాఖాన మెడికల్ ఆఫీసర్లు ముంపునకు గురైన దొడ్ల, మల్యాల, కొండాయి గ్రామాల్లోని పలువురికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాస్కర్, పుణ్యవతి, ఆదిలక్ష్మి, ఓంప్రకాష్, సమ్మక్క, ధనలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

తగ్గిన గోదావరి వరద



ఏటూరునాగారం: తగ్గిన గోదావరి నీటిమట్టం

వెంకటాపురం(కె): మండలంలో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో మండల పరిధిలోని బోదాపురం, కుక్కతోగు వాగు, బల్లకట్టు వాగు వద్ద రోడ్ల పైకి వచ్చిన వరద నీరు తగ్గిపోయింది. ఆదివారం రోడ్లపై వరదనీరు లేక పోవడంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఆదివారం ఉదయం మండల అధికారులు మండలంలోని గోదావరి వరద పరిస్థితులను పరిశీలించారు. పరిశీలించిన వారిలో మండల ప్రత్యేక అధికారి అరవిందరెడ్డి, తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు ఉన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. వారం రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి తగ్గిపోయి శాంతించింది. శనివారం సాయంత్రం నాటికి కూడా రెండవ ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన గోదావరి ఆదివారం సాయంత్రం నాటికి పూర్తిగా తగ్గిపోయి 14.600 మీటర్లతో ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు లేనందున, గోదావరి వరదను దిగువకు వదలడంతో ప్రవాహం కూడా పూర్తిగా తగ్గిపోయింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద ముప్పు నుంచి ప్రస్తుతం కోలుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీ



వెంకటాపురం(కె): తనిఖీ చేస్తున్న పోలీసులు



వాజేడులో..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపుర కాలనీ సమీపంలో ముమ్మరంగా వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో వెంకటాపురం సర్కిల్ పరిధిలో అప్రమత్తమైన పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వెంకటాపురం మండలానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు.

వాజేడు: మండల పరిధిలోని మండపాక వద్ద రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. హైవేపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆపి సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ధ్వంసమైన రహదారి



కోతకు గురైన ఏటూరునాగారం-తుపాకులగూడెం ప్రధాన రోడ్డు

ఏటూరునాగారం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, వాగులు ఉప్పొంగి రోడ్లపై నుంచి ప్రవహించడంతో ఏటూరునాగారం-తుపాకులగూడెం ప్రధాన రహదారి రొయ్యూర్ వద్ద కోతకు గురైంది. ఏటూరునాగారం నుంచి తుపాకులగూడెం వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మొత్తంలో సగభాగం కోతకు గురికావడం వల్ల వాహనాలు బోల్తా పడే అవకాశాలున్నాయి. వెంటనే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



సమ్మెకు మద్దతు తెలుపుతున్న భజన బృందం

మంగపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు కొనసాగుతుంది. ఈ మేరకు శ్రీ హేమాలచ లక్ష్మీనర్సింహాస్వామి భజన కళా బృందం ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో జీపీ కార్మికులు చేస్తున్న సేవలు, వారి కష్టాలను వివరిస్తూ పాటల రూపకంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కమిటీ సభ్యుడు చీకుర్తి కొమిరెల్లి, మండల అధ్యక్షుడు బోడ ఆదినారాయణ, జీపీ కార్మికుల సంఘం నాయకులు లక్ష్మణ్, దశరథం, నర్సింహారావు, శ్రీనివాస్, రవి, ఆదినారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(ఎం): మండలంలోని బుర్గుపేటలో ఆదివారం ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి 92 మందికి వైద్య పరీక్షలు చేసి రక్తన మూనాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలకు గురైన వారు 24 గంటల్లోగా తగ్గకపోతే స్థానిక వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్య చికిత్సలు తీసుకోవాలన్నారు. డాక్టర్ అనిత, డాక్టర్ చందన, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, స్టాఫ్‌నర్స్ జ్యోతి, కృష్ణ, ఏఎన్ఎంలు శోభారాణి, కవిత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ములుగు రూరల్: పరామర్శిస్తున్న గోవింద్‌నాయక్

ములుగు రూరల్: గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బద్దం లింగారెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ములుగు ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. ఆదివారం పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్, ఎల్లారెడ్డి, సుధాకర్, శ్రీకాంత్, సోమయ్య, శ్రీను, తదితరులు ఉన్నారు.

ఇంచర్లలో..

మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన సానవేని పెద్ద ఓదెలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ పరామర్శించారు. ఆదివారం ఓదెలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే జంగాలపల్లికి చెందిన శ్రీపాద హైమావతి ఇటీవల మరణించగా ఆమె కుటుంబ సభ్యులకు చేయూతనందించారు. ఆయన వెంట నాయకులు ముడతనపల్లి మోహన్, చిట్టిబాబు, అమర్‌సింగ్, నవీన్, తదితరులు ఉన్నారు.



వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటలో ఇటీవల కొండా మొగిలి మృతి చెందగా ఆదివారం సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భూపాలపల్లి సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మృతుని కుటుంబానికి చేయూతనందించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ. 2 వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

మొగుళ్లపల్లి: వరద ముంపుతో నష్టపోయిన బాధితులు అధైర్యపడకుండా ఉండాలని.. ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. అంకుషాపూర్, ఇస్సిపేట, బంగ్లాపల్లి, గుడిపహాడ్, వేములపల్లి,ముల్కలపల్లి, కోర్కిశాల గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. వరద బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించి ఎంత నష్టం జరిగిందని, ముంపునకు గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదలతో దెబ్బతిన్న బాధితులకు ప్రభుత్వ అందిస్తున్న నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు తెలిపారు. అస్తవ్యస్తంగా మారిన రోడ్లను, తెగిన చెరువులు, కూలిన బ్రిడ్జిలను, ఒరిగిన చెట్లను, నీటిలో మునిగిన ఇళ్లను పరిశీలించారు. అధికారులు నష్టాలను అంచనా వేసి, నివేదికలు తయారు చేయాలని ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య ఉన్నారు.